# సూతకం కబురు...!

నీలాటి రేవు దోవ. ఆషాడమాసపు మూడోరోజు. బారడు దూరంలో పొద్దుగుంకే వేళ. "ఓలమ్మీ నీలవేణీ, ఆగాగు" అంటూ నాలుగంగలు వేసి నీలవేణిని కలిసిందామె. ఆమె నీలవేణి కంటే పొడగరి. నీలవేణి రెండడుగుల్లో నడిచే దూరాన్ని వొక్క అంగలో నడవగలదామె. ఆమె గొంతు విప్పితే కంచుగిన్నె అంచుమీద గరిటెతో కొడితే వొచ్చే శబ్దంలా వుంటుంది.

"పంచిరెడ్డోళ్ళు–కూల్లు పంచీసినారేటే" అనడిగిందామె. నీలవేణి లేదన్నట్టు నెత్తిమీది బిందెను కాసుకుంటూ తల అడ్డంగా వూపింది.

"సూతకం కవురు తెలిస్తే యెళ్ళొచ్చేనమ్మీ. చెన్నాపురంల మా చెల్లెల్లేదా? ఆళ్ళ బాగారోడే(దాయాది) రగుతు రామినాయుడు. అల్లప్పుడు ఎంపిటీసీ ఎలక్సనప్పుడు ఆడు మనూరు రాలేదా? మన యాదిలోకీ వొచ్చేడు గాదా. గెలిసినాడ్లే. గెలడేటి? పంచిన సొమ్మో? పోసిన బ్రేంది, సారాలో...?

అన్నట్టుగా, కౌంటింగునాడు అతగాడు గెలిస్తే జీపీ మీద అతగాడూ, ఎనక లారీల మీద జెనంవూ, నరసన్నపేటనించి ఊరేగినారు గదా? అదంతా చూసి, నీ పెనిమిటి 'ఎక్కడ్నించి సొమ్మొస్తాదో నంజికొడుకులుకి, ఈ మందుగుండు సామానేటి? ఆ బ్రాందీ, సారాలేటి, ఆ దండలేటి? ఆ దండుగలేటి' అని తిట్టలేదా?

ఔనుగానీ, అమ్మీ, మన తిట్లు ఆళ్లకినబడతాయే, సెప్మీ?..." అని అడిగిందామె. వినబడవన్నట్టు, మళ్లీ ఖాళీ బిందె తలను అడ్డంగా ఊపింది నీలవేణి. నీలాటిరేవుదోవ పదడుగులు నడిచేరు వాళ్లు.

"మా వీధి కొసాయింటి–రగ్గాడు లేడా? ఇసాయి రఘుగాడు. మా పెనిమిటీ, మరికొంతమందీ మద్రాసు తాపీ పనికెళ్లిన నెల్రోజులుకి, యీడూ పెళ్లాన్ని, దాని కన్నోరింటికి తోలీసి, మెడ్రాసెలిపోనాడు! ఆడు సెప్పాడమ్మీ సూతకం కవురు...

'నీకు తెల్దా' అనడిగేడు.

'తెల్దుర నాయినా' అన్నాను.

'ఓసీ పెపంచికమంతా గుప్పుమంతే' అనన్నాడు.

మన్ది, మరో పెపంచికం కదమ్మీ. ఆ మాటే అన్నాను. ఇంతలోకి యెవులొచ్చేరను కున్నావు?"

యెవరన్నట్టున్నట్టు బిందె తలయెత్తి చూసింది నీలవేణి, ఆమెవేపు.

"జుమ్మడు!డు! ఆడొచ్చీ, ఓరెవుర్రా అనడిగేడమ్మీ. ఎవుల్ని? రగ్గాడ్ని! 'ఫలానీవోడూ' అని రగ్గాడు సెప్పొప్పొడమ్మీ.

'ఫలానీవోడోడా? ఆడా? ఆడికి రొండు మేడలున్నాయి! ఇద్దరు దేవతల్లాంటి పెళ్లాలున్నారు. బంగారం లాంటాంటి భూములున్నాయి. మైసూరెడ్లున్నాయి. పదవీ భాగ్యాలున్నాయి-ఆడు సచ్చిపోడమేట్రట్రా, సెసే...' అని యేటేటో అంటాడు. అందికే గదా, ఆడ్ని జుమ్మడంతారు. సావుకాడ అపేమిరేటి, గరీబేటి సెప్మీ" అనడిగిందామె.

నీలవేణి షే మేమీ చెప్పలేకపోయింది బిందె తల కాసుకు నడుస్తూ.

"రగ్గాడు, ఆ మద్రాసు నుంచొచ్చి వోరమైందట. అత్తోరింటిల వుండిపోనాడట. అత్తోరూరు-చెన్నాపురం పెపక్కని సుందరాపురమే గదా!

ఓలమ్మీ ససుందరాపురం నిండా ఇందిరమ్మ ఇళ్లే...యిళ్లట! ఈళ్లకీ, ఆళ్లకీ అని గాదట. కదుపులున్న ః పిండానికీ ఇందిరమ్మ యిల్లేనట తెల్సా? రగ్గాడి పెళ్లానికీ ఇల్లొచ్చిందట! బేంకుల బిల్లుల్లు అందుకునీదాక వుండిపోనాడట రగ్గాడు...

ఔనమ్మీ, ఆ మనూరికీ ఇందిరమ్మ యిళ్లొస్తాయట, నిజిమేనా?" అనడిగిందామె. 'యేం వో' అన్నట్టుగాగా కళ్లు తేలేసి పెదవులు విరిచింది నీలవేణి.

"నీకేటి తెతెల్దమ్మీ, నీలవేణీ. మళ్లా డోక్రా సీ.ఎఫ్. నంతావు. నీకేటి తెల్దమ్మీ. ఇల్లంట తిరగటం, మనుసుల్ని జతజేసి గ్రూపులు గట్టడం, ఆళ్లనోట్టుకొని బేంకుకెళ్లటం, బేంకు ఆఫీసర్లు అడ్డుడ్డసుడి కవుర్లు ఆడితే భరించి బతిమిలాడి, లింకేజి లోన్సు లిప్పించటం చేస్తావుగానీ, ఆ లింకేజీ సొమ్ము ఏటవతందో, యే లీడరమ్మ మింగతందో నీకు తెల్దు. పావలా వడ్డీ చెక్కుల సొమ్ము యెవుళి పాలబడతందో నీకు తెల్దు!

నీకు తెల్దుడ్డుగానీ, మనూరికీ ఇందిరమ్మ యిళ్లొస్తాయే. మన గ్రేమమూ ఆదర్శిగ్రేమమట తెల్సా? రోజుఃకి పది, పదిహేను వేలు రూపాయల బ్రేందీ, సారా చెల్లిన గ్రేమం మండలం మొత్తమ్మీద పెమనదేనట. పొగులూ, రాత్రి పోలీసుబాబులు తిరుగాడే గ్రేమం యిలాటి దింకొకటి లేదుట. అదిగాక, మన పెసిరెంటు, అధికార పారిటీలోకి గెంతేత్తానని రాయబారం పంపినాడటే! ఎవుళ్తోటి తెల్సా?"

ప్రశ్నార్థకంఃగా కళ్లెగరేసింది బిందెలతో నీలవేణి.

"మూడు బుర్రలోడితోటి! ఆడు రంగంల దిగితే అడ్డేటి సెప్మీ? అలాంటిలాంటి యెత్తులేస్తాడేంటి ఆడు! ఒట్టినే పేరెట్టారా మూడు బుర్రలోడని! ఆడు సెప్పేడు...!మన పెసిరెంటు పారిటీ మార్చిడం ఖాయిం. మన ఊరు ఆదర్శిగ్రేమమవటం ఖాయిం. అందిసేత మనకి ఇందిరమ్మ ఇళ్లొస్తాయమ్మీ...!

మీ తోటికోడలూ, మరిదీ మెద్రాసులే గావాలవున్నారు. రగ్గాడు యెల్లుండి మెయిలుకి యెళ్తాడట. ఆడితోటి కవరెట్టు. ఆళ్లని రప్పించు. ఇందిరమ్మ యిళ్లు ఆళ్లకీ రాపించు. ఓలమ్మీ ఇళ్లు కట్టకపోయినా ఫర్లేదటే. ఊరందరూ కట్టిగ్రలేటి? నాడా దొరికిందని గుర్రం కొనీగ్రలా? మేకు దొరికిందని మేడకట్టిగ్రలా? ఎవుళో కట్టినోళ్లు వుంతారు గదా? ఆ ఇళ్ల కాడ యాళ్లని నిలబెట్టి పొటోలు తీస్తారటే. ఆటితోటి బిల్లులు పెడతారట. అవుసింగోళ్లట. ఆళ్లూ, మండలాపీసోళూ ఆ పర్రాకులన్నీ పడతారట. బిల్లుకి యింత అని, పరసింటేజో, యేటోనమ్మా లెక్కేసి వుచ్చుకుంతారట. వుచ్చుకుంతే వుచ్చుకోనీ, మనకేటి పోయింది? సచ్చినోడి పెళ్ళికి వొచ్చినంత కట్నం! ఏటంతావు..?"

నీలవేణి యేమీ అన్లేదు. కనురెప్పలు టపటపలాడించింది.

"పాపం పరాయిదేశం వొలసెలిపోనారు. ఎందుకు పనికొచ్చినా పనికొస్తాయి. మీ వోళ్లకి కవురెట్టిమీ. ఆ తరాత నీ మీద నింద వెయ్యగల్రు. ఇదిగోటి, తోటికోడలుంది, కవురెట్టింది కాదు. దానిలాంటి ఆశ మాకుండదా? మీమేటి, దానికంటా భాగ్గెమంతులుమా? దేశంకాని దేశంల – కూలిబతుకు బతుకుతన్నాం. గవరమెంటు సొమ్మేగదా? ఏటి? దానిదా, దాని కన్నోరిదా? గవరమెంటుది! గవరమెంటు సొమ్ముకే యింత గుణించిన దాయి, వొంశ పరంపర ఆస్తి కైతే – యింకెంత గుణించునో నంజ...అని, తిట్టినా తిట్టగల్దు మీ తోటికోడలు! అసలే పోలవరం పిల్ల అది!"

నీలవేణి గతుక్కుమంది. తోటికోడలు రూపం గుర్తొచ్చింది. సాయంత్రపు ఎండకు తన నీడ వాలుగా తన ముందే కన్పిస్తుండగా కాసేపు అలాగే నిలబడిపోయింది.

"హన్నన్నా...! కవురెట్టీమంతన్నుగానీ, మన పెసిరెంటు గండడు మన పేదా రోదకి యిల్లిస్తాడంతావా? ఎక్కడలేనిదీ ఆడి గుండానికే సాల్దు. గెలిచి యెన్నాళ్లో కాలేదు గండడు పాత అప్పులన్నీ తీరిస్సినాడటమ్మీ. ఇంకా కాలమంతా ముందునుంది. కోలనీలు, పెన్సన్లు, రోడ్లు, కాలవలు, ఈధిలైట్లు...యివేటి, అవేటి? ఎన్నున్నాయి...!?

అడి పెళ్లం అంతాదటా–దీపమున్నప్పుడే యిల్లుగాదు, ఊరు సక్కబెట్టీరా మొగుడా, మళ్లా నిన్ను యీ ఊరోళు గెలిపిత్తారా, యేటీ?మగ గండలేమో గానీ, ఆడనంజలు నీకు ఓటు గాదు, నానోరు తిన్నగ రాదు గానీ...ఆఁ, అది పొయ్యరు అనంతాదట.

ఆ తల్లే, మూడుబుర్రలోడికి కవురెట్టిందట. పారిటీ మార్సీడానికి సిగ్గినేలిచ్చిందట. 'అప్పోజిసను పారిటీల వుంతే ఆదర్శ గ్రేమం అవదూ, అడ్డమయిన నిధులు రావూ, స్కీములు గీములుండవూ, సిలకట్టు పంచె చిరిగిపోగల్దురా' అని మొగుడుతోటి అన్నాదట!

ఓలమ్మీ–ఆడికి సిలకట్టు సిరగకపోయినా అది తక్కువింటిది కాదు, అదే సింపేస్తాది. గొర్లోళ్ల బొట్టె అది! ఆ గండడో, ఆడూ తక్కువోడు కాదు. పాలవలసోడు. ఇద్దరు కిద్దరాకటేన్నే! భగమంతుడలాగ జోడీ కుదురుస్తాడటమ్మీ! ఒక్కొక్కపాలి మాత్రం మేకకి పులినీ, కోడికి నక్కనీ, కప్పకి పాంవునీ జోడీ సేస్తాడట. మరతగాడికి అదేమి తిపారమో...!

పోన్నే, భగమంతుడి లీల గురిండి మనకేలగానీ అమ్మీ, అందిసేత యేటంటే... ఆఁ ... యేటి సెపతన్నానూ...?

అదమ్మా– వొకటి సెప్పి, మరొక దాట్లోకెళిపోనాను, సూడమ్మీకతలూ, కయితలూ రాసేవోళ్లలాగ...!

ఔనమ్మీ, ఆళ్లలగేని, నెలకోపాలి యిస్కూళ్ల మీటింగెడతార్లే. రామసెందర్రావు మేస్టులేరా, అతగాడు కతలవీ రాస్తాడమ్మీ. మజ్జేనం బువ్వ వంటగత్తెలం గదా నేనూ, మా డోక్రా గ్రూపు సబార్గినీజర్ సరస్పతీ. ఆదోరమయినా మీటింగునాడు మాకు డూటీయే. టీ నీలవీసూడమంతాడు రామసెందర్రావు మేస్టు. అదిగో అప్పుడు మాకూ యినమంటాడు. వొచ్చినోళ్లంతా రాసినవి సదువుతారు.

ఆళ్లలగేనమ్మీ – కత వొక్కాడ ఆరంభించి అటుదిప్పి, యిటుదిప్పి యేటేటో సెప్పి ఆకరికి కతలోని మనుసుల్ని ఆళ్ల గోసకి ఆళ్లనొదిలేసి కత ముగిసిందంతారు!

అదేటది అని అడుగుదుమని రొండు మూడుసార్లు ఉరికినాను. కాని మా సరస్పతి ఆపేసింది. ఆళ్లంతా పట్నపోళు. సదుంకున్నోళు. ఆళ్తోటి సాలగలమా? మనకేల? పెంటమీదది యింటి మీదకేల తెచ్చుకోడం అని ఆపేసింది గానీ, యేంవి? అడిగితే తప్పా, సెప్పిమమ్మీ?"

నీలవేణి యేంవీ చెప్పలేక, ఎడమ పయ్యెద చీరకొంగు దారాల్ని కొరుకుతూ నడవసాగింది.

"అదమ్మీ, ఆళ్లలాగ, వొకటి సెప్పి మరొక దానికెలిపోనాను. ఔనుగానమ్మీ పేరెడితే తగినట్టుగుండాల. నువ్వెవులి పిల్లవి? మామిడోళ్ల పిల్లవి. ఎవులి కోడలువి? అట్టాడోళ్ల కోడలువి. నీ యింటికేం పేరెడతావు. అట్టాడోళ్ల యిళ్లు అంతావు. కాదూ, పోదూ నీ కన్నవోరు గానీ సొమ్ము యిచ్చినారనుకో నీ కన్నోరింటి పేరడతావు. అదీ యిదీ గాక మద్దెకాన ఆ యమ్మ పేరెందుకే?

ఏటి? ఆ యమ్మ తక్కువింటిదా యేటి? జెనం అరిగోస బెట్నారట. రాజ్జిం రాజ్జిం ఉడికిపోయిందట, తల్లి యేలుబడిల! పోన్నే ఆయమ్మ యిపుడు బతికిలేదు, మంచే చేసిందో, చెడే చేసిందో... అద్దద్దో అల్లా తూరుపుని దూరి, పడమటకి గుంకుతండు ఆ సూర్నారాయిణమూర్తికి తెల్సు... అదొదిలీగానీ పేరెట్నావంతే కుదరాల! ఆయమ్మ - యిలాటిలాంటి యిళ్లంట వుండీదా? సీ...!

అమ్మీ, రాజులు కోటల్లంటా, మంతుర్లు భవొంతుల్లంటా, పశివిలు సొలల్లంటా, పచ్చులు గూళ్లంటా, మన్లాటి పేదారోదా ఇళ్లంటా వుంతారు! మన యిళ్లకి ఆయమ్మ పేరెందుకే...?

ఏటి? యిలాపింటి పెశ్నిలన్నీ యెవులు, వాటరు కమిటీ సేర్మేన్ శిమ్మ రాజారావు అడిగినాడమ్మీ! ఎవుల్ని? నన్ను...? 'ఓరి నన్నడుగుతావేట్రా? నానేటి సెప్తాన్రా? సేతయినోడవైతే యెవులు పేరెట్నారో ఆళ్లనడుగురా' అనన్నానే...!

'ఏంవి? అడిగితే కొట్టెస్తరా, సంపెస్తరా' అనన్నాడమ్మీ.

అడిగిసూడు యేటి సేస్తారో తెలుస్తాదన్నానమ్మీ. ఆడు వొకసిటం ఆలోసించి భుజమ్మీది పసుపు తువ్వాలు తీసి దులిపి, 'యేంవో... మొఱయా నంజికొడుకులు! అధికారంల వున్నారు. ఏటి సేసినా సేస్తారు. మాళ్లా మాకు అధికారం రాదా? అప్పుడు అడగడం వేటి, కడిగేస్తాం. కడగడంవేటి, ఉతికేస్తాం' అనుకొని యెళిపోనాడమ్మీ.

పెనమ్మీద పోసిన అట్టు తిరగెయ్యక మాన్తారా అని సూస్తండమ్మీ ఆడు! ఆ గండల ఊసేల గానీ, రగ్గాడు సూతకం కవురు సెప్పీసరికి గింజుకున్నానమ్మీ. ఏటి సెయ్యిడం, యెల్లి రావాలగదా? సెల్లిలి తరుపు బంధువు. ఎవళెల్తారు? నా పెనిమిటి దేశిమెళిపోనాడు. పిల్లలా సిన్నోళు. అత్త సంగతి నీకు తెల్సు. ఇక మామ సంగతా నీకే గాదు, నోకం వంతటికీ తెలుసు. 'ఎర్రతువ్వాలోడూ, యెర్రికేకలోడూ' అని పేరుబడిపోనాడు. పేరెట్టరా మరి! ఎర్రరంగుకీ, ఎర్రి కేకలకీ కూల్లు పెంచేత్తారా? ఇళ్లూ వాకిళ్లిచ్చేత్తారా? దున్నినోడిదే భూమి తీసుకో-అని వొప్పగిత్తారా? సెప్పిమమ్మీ...?"

నీలవేణి తల కిందకీ మీదకీ ఊపింది. బిందె ఊయలూగింది.

"ఆషాడమాసం నించి ఆరంభిత్తాడమ్మీ- కాలువ మరమ్మత్తులు, వరద కట్టలు, యిత్తనాలు, ఎరువులు, మందులు, కూలిరేట్లు... యిలాగ సంకురాత్రి పోయిదాకా కరపత్రాలు, మీటింగులు, ధర్నాలు, దరువులు కాయడాలు...! యిదే యవ్వారం...! యేంవంతే - యిది దొంగల రాజ్జెం - అనంతాడు. మనమేటి కాదన్నామేటి? దొంగలరాజ్జెం పోయిదాక, పోరాటం తప్పదని కంఠసించుకొని కరపత్రాలొట్టుకొని సల్లంది కూడేనా తినకండా యెళిపోనాడు. రాజ్జిం పోయిందాకా ఆకలాగతాదమ్మీ? సెప్మీ...?"

నీలవేణి దోవ వేపు చూసింది. అప్పటికి వారు సగం దోవ నడిచేరు.

"అందిసేత, నేనే పరిగెట్నానమ్మీ. నీ నెల్లీసరికి కట్టె వుందమ్మీ. పసుపునీళు పోసి, కొత్తపంచె కట్టి, కాడి మీదకెత్తుతన్నారు. జెనం నిండిపోయున్నారు. గడపంతా పసుపు నీళ్లతోటి తడితడిగుంది.

పెద్దపెళ్లం – యీధి గుమ్మం దిగలేదు. చిన్న పెళ్లం మాత్రం – వొకపక్క యేడస్తంది, మరొకపక్క ఆళ్లనీళ్లని పలకరిస్తంది. యెవుళెవుళికో యేటేటో పన్లు పురమాయిస్తంది. దాని దగ్గరకెళ్లి పరామర్శించినానమ్మీ! అది యెగాదిగా చూసిందమ్మీ! ఓలమ్మా యిదేటిలగ చూస్తందనుకున్ను!. అంతలోకి, కాడెత్తినారమ్మ. 'నారాయిన్నారాయన' అన్నారంతా. చిల్లర డబ్బులు ఆ సచ్చినోడి గయినాన (కొంగున) కట్టీసి మా సెల్లిలి కోసరం సూసినానమ్మీ. అదీ నన్ను సూసిందిగావాల... వొచ్చి, కాడి కదిలింతరాత నన్ను యీధి యివతలకి నడిపించి 'నువ్వేటి పారొచ్చినావంది?' 'అదేటోలమ్మీ – సచ్చినోడు మీ బాగోరోడుగదా' అన్నాను. 'పూర్వం బాగారోడు, యిప్పుడు కాడ'న్నాది, ఏటో అయ్యిందిగావాల – ఆ సచ్చినోడు యే అన్నేయిమో చేసుంతాడనుకున్ను. ఎందుకంతే ఆ సచ్చినోడు మన పెసిరెంటు లాటోడేనమ్మీ. మనోడికంటా ముదురు. మనోడింకా పెసిరెంటే! ఆడు ఎంపీటీసీ...! ఇంకా జిల్లాకి యెగబాకునట. మన పెసిరెంటూ యెగబాకడంకి, యెదకతండు గాదా నిచ్చెన్లు! మరి, ఆడిలాగా యీడికీ అర్థంతరం సావురాసి వుంతే యేంవోగాని లేపోతే ఆడ్ని మించిపోతాడు.

అయితే అమ్మీ నీలవేణీ, 'ఆడికి అర్థాంతరం సావురాకపోతే మా వోళి చేతిల చచ్చిపోను గండడు' అన్నాదమ్మీ మా సెల్లెలు..నేను గతుక్కుమన్నాను. అనుమానంగా దాని మొకాన మొకం బెట్టి సూసేను..అలాటిది కాదన్నాది! మరేటయితే...?

'ఏటా? యేటని సెప్పుదునోలప్పోలప్పా. ఆ సచ్చినోడి కళ్లు కళ్లు కావోలప్పా. అగ్గిబుడ్లు. ఆడి కళ్లల్ల జిల్లేడు పాలుబొయ్య. ఆ సచ్చినోడి కళ్లుబడి మా బతుకు బుగ్గయిపోయిందప్పా. భూంవి బుగ్గయిపోయిందప్పా. పంటలూ, బాగ్యేలూ బుగ్గయిపోనాయప్పా...' అని, సన్నటి గొంతుతోటి రాగాలు తీసి సెప్పుకొచ్చిందమ్మీ – ఆస్తుల తగువులు, ఈళ్లపేరుమీద ఆడు వోడుకున్న కోపరేటివ్ అప్పులు, జాయింటుగా పండించిన చెరుకు పంట, ఫేట్రీవోడి మాయకి సెప్పి మిగలటాలు, యిలాగ ఆళ్లని యిరికించి పంటనీ, పశివిల్నీ, కొసకి భూం వినీ కొల్లగొట్టి యింకా సాలక మా మరిదిని పాలెరికం వుండి బాకీ తీర్సమన్నాడట! మా మరిది యెప్పుడో ఒకప్పుడు యెక్కడో వొక్కాడ, పీకపిసికి చంపీసి గొయ్యితీసి పాతీసి తులసి మొక్క నాటకపోను – అనీవోడట!

ఎక్కడా అనకమీ యీ మాట! ఎముడు సచ్చినా ఎముడి పెళ్లాలిద్దరున్నారు, యెక్కడనకమీ – అని చెప్పిందమ్మీ మా సెల్లెలు! అప్పుడు బోధపడిందమ్మీ, ఆ సచ్చినోడి చిన్నపెళ్లాం నన్నెందుకు ఎగాదిగా చూసిందో!

నా నోటిల నూగింజ నానదు – నీకు సెప్పీసేను, నువ్వెక్కడనకమీ యీ మాట" అని నీలవేణి పేపు చూసింది.

నీలవేణి తలను అటూ యిటూ, అలాగే నన్నట్టు తిప్పింది. తలమీది బిందె వయ్యారంగా ఊగింది.

"అమ్మీ–ఆ భగమంతుడికాడ యెంత రాయించుకొచ్చాంవోగానీ, మా అప్పజెల్లె లిద్దరి బతుకులొకటే! ఎవుళికీ దినం తీరింది కాదు. కన్నోరింటిల్లా సుక పడ్లేదు. అత్తోరింటిలా సుకపడ్లేదు. గడియ తీరదూ గవ్వ మిగలదూ అన్నట్లుగయ్యింది.

మా కన్నోరూరు మెరక తల్లీ. వొర్సాధారభూంవులు. వరి పంట పండిన యేడు పండుగే మాకు. అపుడే వరికూడు మూన్నాళ్లు తింతాం. మిగిలిన్నాడు జొన్నకూడూ, చోడంబలే.

తల్లిదండ్రులుకి మా యిద్దరిమే సంతానం. మొగపిల్లల్లాగ మేమూ అన్ని బదవలూ చేసినాం. ఏతమెత్తి నీరు తోడినాం. గొప్పులు దవ్వినాం. గొర్రె, మేకా పెంచినాం. ఏట్లాభం? మా పెళ్లిళ్లు అయ్యాసరికి తల్లిదండ్రులుకి యిల్లొక్కటే మిగిలింది. ఎలగబతకతన్నారో తల్లీ దండ్రీ...?

అత్తోరిళ్ల కొచ్చేం - నీటి వసతి వున్నాది గానీ భూవసతి యేది? అర ఎకరం భూమికి యిద్దరమేల? ఎర్రజెండొట్టుకొని సాధించినావు గదా-నువ్వే అది దున్ను నేను దేశమెలిపోతానని, తండ్రికి భూమి బాద్దెతా, మా బాద్దెతా వొప్పజెప్పి వొలసెల్లినాడు, నా పెనిమిటి!

అమ్మీ - పేదబతుకంత నరకం మరొకట్లేదు. అందులోకీ ఆడబతుకైతే నరకం సాలదు గదమ్మీ?

నీలవేణి నిట్టూర్చింది ఔనన్నట్టుగా. ఇద్దరూ నీలాటిరేవు చేరారు. నాల్రోజులకిందట పడిన వర్షానికి నది నిండుగా ప్రవహిస్తోంది. వరదనీరు జేగురు రంగులో వుంది. నది మధ్యలో చిన్నగా కెరటాలు.

"అమ్మీ ఒక సిటం వొడ్డుమీద కూకందామే. అలిసిపోనానే తల్లీ. మతుకు కొసకి నడిసినట్టుగ వుందే కూకోయే."

"అమ్మీ -మొగుడొక్కాడ, పెళ్లాంవొక్కాడ అది సంసారమేనా?" అనడిగిందామె. నీలవేణి ప్రవాహం వేపు చూసింది. ఎర్రి కేకలోడని పేరెట్నారు గానీ, మా మామ సెప్పినట్టుగ జరిగితే బతుకులిలగుండకపోనే! దున్నీవోడికి భూంవీ, పండించిన పంటకి ధరా, ఆ పంటలకి మిల్లులూ గాని వుంతే - యింతమంది ఊళ్లొదిలీసి వొలసలెందుకెళ్తారు? పట్నాలూ, నగరాలూ యీ జెనంతోటి నిండిపోయి కిటకిటలెందు కాద్తాయి? అని యేటేటో పూసగుచ్చేదమ్మీ, ఒకసారి మెద్రాసెళ్లొచ్చి మా మామ! మెద్రాసులోనేటా నానా యిరకాటాలూ పద్తంద్రట, మన ఊళ్లోనుండెల్లినోళు. వొక యిల్లా, వోకిలా? వొంటా వార్పా! సంసారంవా? అనంతాడు! నిజంవే, గానేటి సెయ్యిగలం? ఇక్కడ బతుకు లేదు. అక్కడ బతుక్కి సుకం లేదు. యేటంతావమ్మీ? మనకోసరం గాకపోయినా, మన పిల్లల కోసమేనా తప్పతాదంతావా" అనడిగిందామె.

నీలవేణి కొంగుముడి విప్పి ఇండుపు కాయ తీస్తూ తల పంకించింది. "ఓలప్పా - నువ్వేటో ఆశలెట్టుకున్నావు గానీ, సంపాదన సంగతేంవో గానీ, సంసారం మునిగిపోయినట్టుగుందట - సూసుకొమ్మీ - అన్నాదమ్మీ, మా సెల్లిలు!"

నీలవేణి ప్రశ్నార్థకంగా చూసింది.

"ఆళ్లఊరు మనిసేనట. తల చెడిన మనిసట, పాపం. కన్నబిడ్డని తీసుకొని దేశిమెళ్లిపోయిందట. ఎర్రగా, బుర్రగా వుంతాదప్పా, వంటా వార్పు, కేరేజి కట్టడాలూ కలిసి తిరగడాలూ యిద్దరూ యిలాగ జోడీ వొదలకండా తిరగతన్రంట. రగ్గాడు సెప్పాడు. సూసుకొమ్మీ! అనన్నాది. యేటి సూసుకోడం సెప్పిమమ్మీ?" అనడిగిందామె.

నీలవేణి యేమి చెప్పునో, యిాలోగా ఆమే-

"ఇల్లు సూడనా? ఇంట్లోని పిల్లల్ని సూడనా? యిక్కడి బతుకు సూడనా? యేటి సూసుకోను? ఔనుగాని అమ్మీ – మొగుడూ పెళ్లాల్ని కట్టిపడీసి వుంచీదేటి? పెళ్లా? పిల్లలా? నీతా, నియమ్మా? వొకళ్లమీద వొకళ్ల అప్మానాలా? ఏటి?"

నీలవేణి నీటిమీద పడ్తోన్న పొద్దు ఆఖరి కిరణాన్ని చూడసాగింది. ఆమె కాసేపు మౌనంగా కూచుని తర్వాత లేచి–

"అమ్మీ నీకు ఈతొచ్చా" అనడిగింది.

నీలవేణి వొచ్చున్నట్టు తలూపింది. "అయితే వొకసారి యివతల వొడ్డునించి అవతల వొడ్డుకీ, అట్నించిటూ, ఈత కొడ్దుమా?"

నీలవేణి పొద్దువేపు చూసి, వొద్దన్నట్టు తల అడ్డంగా వూపింది. ఆమె నిట్టూర్చి "కనబడదుగానీ బతుకింతకి తక్కువ లోతు కాదు. వుండు – సూతకం తానం సేసీసొస్తాను" అని నదిలోకి కొంతదూరం నడిచి, బుడుంగున తలముంచి మునిగిందామె.

కాసేపటికి నీటిమీద ఆమె చీర తేలుతూ కన్పించింది! నీలవేణి ఆమెకోసం చూస్తోంది...!

♦ **ఆదివారం ఆంధ్రజ్యోతి – 14 అక్టోబరు, 2007** ♦